సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
సోమవారం ‌। 15 ‌। మే ‌। 2023



47.103 టీఎంసీలు

చేజర్ల(సోమశిల): సోమశిల జలాశయంలో ఆదివారం సాయంత్రానికి 47.103 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పైతట్టు ప్రాంతాల నుంచి 184 క్యూసెక్కుల వంతున వరద ప్రవాహం వచ్చి చేరుతోంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు) - రూ.63,050
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా) - రూ.5,662
3 శాతం జీఎస్టీతో.. - రూ.5,832
నవర (8 గ్రా) - రూ.46,656

వాతావరణం

గరిష్టం/కనిష్టం
40.0 /31.6

ఆదివారం ఉష్ణోగ్రతలు అధికంగా నమోదయ్యాయి. గాలిలో 36 శాతం తేమ ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.

న్యూస్‌రీల్

భూసేకరణలో అవకతవకలపై ఆర్ఐ, వీఆర్వో సస్పెన్షన్

నెల్లూరు(దర్గామిట్ట): కండలేరు జలాశయానికి సంబంధించి కలువాయి మండలం చౌటపల్లిలో జరిగిన భూసేకరణలో అవకతవకలపై సస్పెన్షన్ల పరంపర కొనసాగుతోంది. గతంలో ముగ్గురు తహసీల్దార్లపై వేటు పడిన విషయం తెలిసిందే. తాజాగా మరో ఇద్దరిని సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఎం.హరి నారాయణన్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో కలువాయిలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసి ప్రస్తుతం పొదలకూరులో ఉన్న నవీన్‌కుమార్, గతంలో చౌటపల్లి వీఆర్వోగా పనిచేసి ప్రస్తుతం అదే మండలం కనుపూరుపల్లిలో ఉన్న జయరామయ్యను సస్పెండ్ చేశారు. చౌటపల్లి చెరువుకు సంబంధించి భూసేకరణలో అవకతవకలు జరగడంతో వారిపై వేటు పడింది.

నేటి నుంచి ఏపీఈఏపీ సెట్

నెల్లూరు(టౌన్): ఇంజినీరింగ్, అగ్రికల్చర్ అండ్ మెడికల్ కోర్సుల్లో ప్రవేశాల కోసం ఏపీఈఏపీ సెట్‌ను సోమవారం నుంచి ఈనెల 23వ తేదీ వరకు నిర్వహించనున్నారు. ఉదయం 9 నుంచి 12 గంటల వరకు మధ్యాహ్నం 3 నుంచి 6 గంటల వరకు ఈ సెట్ జరుగుతుంది. ఈ పరీక్షకు జిల్లా వ్యాప్తంగా 12 వేల మందికి పైగా విద్యార్థులు హాజరుకానున్నారు. నెల్లూరులోని నారాయణ ఇంజినీరింగ్ కళాశాల, కోవూరులోని గీతాంజలి ఇంజినీరింగ్ కళాశాల, కావలిలోని ఆర్ఎస్ఆర్ ఇంజినీరింగ్ కళాశాల, పీబీఆర్ విశ్వోదయ ఇంజినీరింగ్ కళాశాలలో పరీక్షను ఆన్‌లైన్ విధానంలో నిర్వహించనున్నారు. సెట్ నిర్వహణకు సంబంధిత అధికారులు అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు.

పెదపవనిలో నాటక పోటీలు

లింగసముద్రం: పావని ఆర్ట్స్ ఆధ్వర్యంలో మండలంలోని పెదపవని భలేరావ్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద నేటి నుంచి 18వ తేదీ వరకు జాతీయ స్థాయి నాటక పోటీలు నిర్వహించనున్నట్లు ఎం.రాఘవేంద్రరావు కళా పరిషత్ అధ్యక్షుడు ఎం.నాగేశ్వరరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 8 గంటలకు చీకటి పువ్వు, 9 గంటలకు ప్రక్షాళన నాటికలు ప్రదర్శిస్తామన్నారు. ఈ కార్యక్రమ ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా కందుకూరు ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి హాజరవుతారన్నారు. నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకరరెడ్డి, కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్సీ తూమాటి మాధవరావు తదితరులు, సినీ నటులు శివబాలాజీ, మధుమిత విచ్చేస్తారని తెలియజేశారు.

జై హనుమాన్



నెల్లూరు కృష్ణ యోగమందిర ప్రాంగణంలోని ఆంజనేయస్వామి ఆలయంలో..



లక్ష నాగవల్లీ దళార్చనలో పాల్గొన్న భక్తులు



గాంధీబొమ్మ సెంటర్ సమీపంలోని సీతారామ లక్ష్మణ సమేత ఆంజనేయస్వామి దేవస్థానంలో హోమం నిర్వహిస్తున్న అర్చకులు



కావలి రూరల్ మండలంలో జెండాలతో ర్యాలీ చేస్తున్న భక్తులు

హనుమజ్జయంతి సందర్భంగా ఆదివారం జిల్లా వ్యాప్తంగా వివిధ ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. పలుచోట్ల భక్తులు ఆంజనేయ స్వామి చిత్రం ఉన్న జెండాలను పట్టుకుని శోభాయాత్రలు చేశారు. రామభక్తుడి భారీ విగ్రహాలకు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. ప్రజలు పెద్దసంఖ్యలో ఆలయాలకు విచ్చేసి హనుమంతుడిని దర్శించుకున్నారు. – సాక్షి నెట్‌వర్క్

జీవితాన కరెంట్ వెలుగులు





అనగనగా ఓ ఎలక్ట్రికల్ దుకాణం. అక్కడ జేబులో టెస్టర్, చేతిలో కటింగ్ ప్లేయర్, స్క్రూడ్రైవర్తో కొందరుంటారు. ఎవరైనా వచ్చి తమ ఇల్లు లేదా షాపు ఇతర చోట్ల పని ఉందని పిలిస్తే వెళ్లడం.. రిపేర్లు చేసి డబ్బు సంపాదించడం. దశాబ్దం క్రితం వరకు కరెంట్ పని చేసేవాళ్లు ఇలాగే ఉండేవారు. కాలం మారింది. ఈ వృత్తిలో అనేక మార్పులొచ్చాయి. ఇప్పుడు ఎలక్ట్రికల్ దుకాణాల వద్ద కరెంటోళ్లు ఉండడం తగ్గిపోయింది.

మారిన పని పద్ధతులు

- ఒకప్పుడు స్విచ్ పాయింట్, నేడు అంకణం లెక్కన
- రిపేర్లు చేసేవారికి ఫుల్ డిమాండ్
- సేఫ్టీ పరికరాలంటే తెలియదు
- అయినా ధైర్యంగా పనిలోకి..

సాక్షి, నెల్లూరు డెస్క్: 'ఆ వైరు అక్కడి వరకు లాగు.. ఈ స్విచ్‌కి లైట్ కనెక్షన్ ఇవ్వు. ఇక్కడ ఇంకో ట్యూబ్‌లైట్ వేస్తే బాగుంటుంది. ఏసీ కోసం ఎంసీబీ ఉంటే బెటర్. ఎర్త్ లేకపోతే చాలా ఇబ్బంది. హాల్లో ఫ్యాన్ పాయింట్లు రెండు పెడదాం..' కరెంట్ పనిచేసే వారు నిత్యం చెప్పే మాటలివి. నేడు విద్యుత్ వినియోగించని వారు ఉండరు. ఎలక్ట్రీషియన్లకు మార్కెట్లో చాలా డిమాండ్ ఉంది. వైరింగ్, స్విచ్ బోర్డులు, లైటింగ్ అంటూ ఈ వృత్తిలో టెక్నాలజీ పరంగా చాలా లెక్కలుంటాయి. అయితే ఇదంతా చేసేది సాధారణ వ్యక్తులే. ఈ పనిచేసే వారిలో చాలామంది పెద్దగా చదువుకుని ఉండరు. కుటుంబ పరిస్థితుల దృష్ట్యా కరెంట్ పని నేర్చుకుని పొట్ట పోసుకుంటున్న వారే అధికం. సీనియర్ల అంచనా ప్రకారం నెల్లూరు నగరంలోనే 300 మంది పైనే ఎలక్ట్రీషియన్లు ఉన్నారు. జిల్లాలో రెండువేలకు పైగా ఉండొచ్చు.

చాలా ధైర్యంగా..

విద్యుత్ వల్ల ప్రమాదమని తెలిసినా ఎలక్ట్రీషియన్లు చాలా ధైర్యంతో పనులు చేస్తుంటారు. వర్షాకాలంలో సమస్యలు ఎదురవుతాయని తెలిసినా లెక్క చేయరు. నిచ్చెనలు, ఎత్తైన స్టూళ్లు ఎక్కేసి పని చేస్తుంటారు. సేఫ్టీ పరికరాలు దాదాపుగా ఎవరూ వాడరు. గ్లౌజులు, కళ్లద్దాలు, హార్డ్ హ్యాట్, బూట్లు వేసుకుని పనిచేసే వారు ఈ ప్రాంతంలో ఎవరూ లేరు. చాలామందికి బీమా కూడా లేదు.

మరికొన్ని..

- ప్రస్తుతం చాలా పనుల్లో ఇతర రాష్ట్రాల వారు అధికంగా ఉంటున్నారు. మార్బుల్స్ వేయడం, సీలింగ్ తదితరాల్లో ఏ ఊరిలో అయినా వారి హవానే ఎక్కువ. కానీ కరెంట్ పనిలో ఆ పరిస్థితి లేదు. స్థానికంగా ఉన్న వారే చేస్తున్నారు.
- కొందరు కరెంట్ పనితోపాటు ప్లంబింగ్ కూడా చేస్తుంటారు. వీరి సంపాదన బాగుంటుంది. అయితే ప్లంబింగ్ చేస్తూ ఎలక్ట్రికల్ పనులు చేసేవారు ఉండరు.
- ఎలక్ట్రీషియన్లను ప్రసన్నం చేసుకునేందుకు ఎలక్ట్రికల్ ఉత్పత్తులు విక్రయించే సంస్థలు సమావేశాలు పెడుతుంటాయి.
- నెల్లూరులో ఎలక్ట్రీషియన్లకు యూనియన్ ఉంది. అయితే కాలక్రమేణా అది కనుమరుగైంది.

ఒకప్పుడిలా..

పని పద్ధతులు చాలావరకు మారిపోయాయి. గతంలో ఎలక్ట్రికల్ దుకాణాల వద్ద కరెంట్ పనోళ్లు ఉండేవారు. ఈ సంప్రదాయం నెల్లూరులోని స్టోన్‌హౌస్‌పేట నుంచి మొదలైందని చెబుతుంటారు. ఈ ప్రాంతంలో అప్పట్లో పదుల సంఖ్యలో ఉండి పని దొరికితే వెళ్లి చేసేవారు. నేడు ఫోన్ల వినియోగం పెరిగింది. ఎలక్ట్రీషియన్లు ఇళ్ల లేదా వ్యాపార సంస్థల వారికి ఫోన్ నంబర్ ఇస్తున్నారు. వారు పిలిచినప్పుడు వెళ్లి పని చేస్తున్నారు. దుకాణాల వద్ద ఎదురుచూసే పరిస్థితులు ఇప్పుడు తగ్గిపోయాయి. కొందరు విజిటింగ్ కార్డులు కొట్టించి ఇస్తున్నారు.



కొత్త బిల్డింగ్‌లో పనిచేస్తున్న ఎలక్ట్రీషియన్

ఉపాధి దొరుకుతుందని..

గృహాలు, వ్యాపార సముదాయాలైతే గతంలో స్విచ్ పాయింట్ లెక్కన నగదు తీసుకునేవారు. ఒక్కో పాయింట్‌కు రూ.20 నుంచి రూ.30 వరకు ఉండేది. నేడు అంకణం లెక్కన తీసుకుంటున్నారు. ఒక్కో అంకణానికి రూ.1,500 నుంచి రూ.3,000 వరకు ఉంది. కూలికి వచ్చేవారికి రోజుకు రూ.800 నుంచి రూ.900 వరకు ఇస్తున్నారు. అదే మేస్త్రీ అయితే రూ.1,000కి అటు ఇటుగా తీసుకుంటున్నారు. రిపేర్లయితే పనిని బట్టి వసూలు చేస్తున్నారు. మెటీరియల్ కాంట్రాక్ట్ చేసేవారు కొందరున్నారు. అలాగే పెద్ద తాపీ మేస్త్రీలు, బిల్డర్లు, ఇంజినీర్ల వద్ద ఉంటూ పనులు చేసే ఎలక్ట్రీషియన్లు నేడు అధికం. దీని వల్ల ఉపాధికి భరోసా ఉంటుంది.



స్టోన్‌హౌస్‌పేటలోని ఎలక్ట్రికల్ దుకాణంలో ఉన్న ఎలక్ట్రీషియన్లు

చాలా మార్పులు వచ్చాయి



పని విధానం చాలా మారిపోయింది. ఒకప్పుడు మా ప్రాంతంలో సుమారు వంద మంది వరకు ఎలక్ట్రీషియన్లు ఉండేవారు. రిపేర్ అంటే వెంటనే వెళ్లేవారు. నేడు 20 మంది కూడా లేరు. ఫోన్లు వచ్చాక సిస్టమ్ మారింది. కరెంట్ పనోళ్లు కావాలంటూ ఎవరైనా మా దగ్గరకు వస్తే వెతుక్కునే పరిస్థితి ఉంది. ఎలక్ట్రీషియన్ల ఫోన్ నంబర్లు ఇస్తున్నాం. చాలామంది కాంట్రాక్టర్ల వద్ద ఉంటున్నారు. నెల్లూరులోని ఎలక్ట్రికల్ షాపులు సుమారు వంద వరకు ఉంటాయి. అన్ని చోట్ల ఇలాగే ఉంది.

– గాదంశెట్టి ప్రకాశరావు, ఫ్యాన్సీ ఎలక్ట్రికల్స్, స్టోన్‌హౌస్‌పేట

32 ఏళ్ల నుంచి చేస్తున్నా



నేను 32 సంవత్సరాల నుంచి కరెంట్ పనిచేస్తున్నా. రిపేర్లు చేస్తా. కొత్త ఇళ్లకు వైరింగ్ చేస్తా. మూడు దశాబ్దాల్లో చాలా మార్పులు చూశా. మార్కెట్లోకి కొత్త వస్తువులు వస్తుంటాయి. వాటి గురించి ఎప్పటికప్పుడు తెలుసుండాలి. లేకపోతే వెనుకబడి పోతాం.

– కంచి రవి, ఎలక్ట్రీషియన్, స్టోన్‌హౌస్‌పేట

ధైర్యమే మా పెట్టుబడి

నేను 15 సంవత్సరాలకు పైనుంచి పనిచేస్తున్నా. కొత్త ఇళ్లు, వ్యాపార సంస్థల పనులు ఎక్కువగా చేస్తుంటారు. కరెంట్ అంటే చాలామంది భయపడతారు. మాకు కొంచెం భయం ఉంటుంది. కానీ జాగ్రత్తగా చేస్తాం. ధైర్యమే మా పెట్టుబడి. గ్లౌజులు, కళ్లద్దాలు పెట్టుకోవడం, బూట్లు వేసుకోవడం తెలీదు.

– జాలయ్య, ఎలక్ట్రీషియన్, నెల్లూరు

160 బస్తాల రేషన్ బియ్యం స్వాధీనం

వెంకటాచలం: మినీ లారీలో రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తుండగా వెంకటాచలం టోల్‌ప్లాజా వద్ద సెబ్ అధికారులు ఆదివారం ఉదయం పట్టుకున్నారు. వివరాలు.. సెబ్ సీఐ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో టోల్‌ప్లాజా వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సమయంలో గూడూరు వైపు నుంచి నెల్లూరు వైపు వెళ్తున్న మినీ లారీలో రేషన్ బియ్యం రవాణాను గుర్తించారు. నకిలీ వే బిల్లులను డ్రైవర్ విజయ్ చూపారు. సూళ్లూరుపేటలో పేదలకు పంచాల్సిన రేషన్ బియ్యాన్ని నెల్లూరుకు అక్రమంగా రవాణా చేస్తున్నట్లుగా గుర్తించి మినీ లారీతోపాటుగా అందులో ఉన్న 160 బస్తాల రేషన్ బియ్యం బస్తాలను స్వాధీనం చేసుకున్నారు. వెంకటాచలం పోలీస్‌స్టేషన్లో అప్పగించి కేసు నమోదు చేశారు.

102లో డ్రైవర్ పోస్టుల భర్తీకి చర్యలు

నెల్లూరు(అర్బన్): నెల్లూరు నగరంలో 102 తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనంలో పని చేసేందుకు డ్రైవర్ పోస్టులను భర్తీ చేసేందుకు 102, 108, 104 వాహనాల జిల్లా మేనేజర్ పవన్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణులై, బ్యాడ్జీ, హెవీ డ్రైవింగ్ లైసెన్స్ కలిగి నెల్లూరు పరిధిలో నివసించే వారు మాత్రమే అర్హులన్నారు. ఆసక్తి గలవారు ఈనెల 18వ తేదీ లోపు దర్గామిట్టలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి (పెద్దాస్పత్రి) వద్ద ఉన్న దిశ పోలీస్‌స్టేషన్ పక్కనున్న తమ ఆఫీసులో నేరుగా దరఖాస్తులు అందజేయాలని కోరారు. ఇతర వివరాలకు 90007 44043 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

సింహ వాహనంపై కామాక్షితాయి

బుచ్చిరెడ్డిపాళెం: మండలంలోని జొన్నవాడలో వెలసిన మల్లికార్జున స్వామి సమేత కామాక్షితాయి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం అమ్మవారు సింహ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం యాగశాల వద్ద దీక్షా హోమం నిర్వహించి అనంతరం దేవస్థాన ప్రాకార మండపం వద్ద బలిహరణ పూజ చేశారు. సాధువులను రక్షించే క్రమంలో కామాక్షితాయి రౌద్ర రూపాన్ని దాల్చి రాక్షస సంహారం చేస్తుంది. మహిషాసురుడిని కూడా అంతమొందించే సమయంలో అమ్మవారు రౌద్ర రూపం దాల్చి దేవతా సైన్యానికి నాయకత్వం వహిస్తూ సింహ వాహనంపై కొలువై భక్తులను కటాక్షించారు. రుద్రుడైన మల్లికార్జున స్వామిలో అర్ధనారీశ్వరిగా ఉన్న కామాక్షితాయి అమ్మవారికి గ్రామోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి శ్రీశైలం రామమూర్తి జ్ఞాపకార్థం వారి కుమారులు, కందికట్టు శివకుమార్, కందికట్టు సుబ్బారావు, కందికట్టు వెంకటరమణయ్య, కందికట్టు కామేశ్వరరావు జ్ఞాపకార్థం వారి కుటుంబసభ్యులు ఉభయకర్తలుగా వ్యవహరించగా, ఆలయ చైర్మన్ పుట్టా సుబ్రహ్మణ్యంనాయుడు, ఈఓ వెంకటేశ్వర్లు, పాలకమండలి సభ్యులు నందకుమార్, శివకుమార్, రఘురామయ్య, సుప్రజ, పద్మ, విజయమ్మ, విమల, కామేశ్వరి, శశిశేఖర్‌శర్మ పాల్గొన్నారు.



అమ్మవారికి పూజలు చేస్తున్న అర్చకులు



విద్యుద్దీపాలంకరణలో కామాక్షితాయి ఆలయం

18 కిలోల గంజాయి పట్టివేత

కావలి రూరల్ : కావలి డివిజన్ పరిధిలో వివిధ ప్రాంతాల్లో గంజాయి విక్రయిస్తున్న ఏడుగురిని అరెస్ట్ చేసి వారి నుంచి సుమారు రూ.54 వేల విలువ చేసే 18 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు కావలి డీఎస్పీ వెంకటరమణ తెలిపారు. కావలి పట్టణంలోని డీఎస్పీ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. డివిజన్ పరిధిలోని కొండాపురం మండలం రామానుజాపురం గ్రామానికి చెందిన కొరివి మస్తాన్ గంజాయి విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి ఆదేశాల మేరకు కలిగిరి సీఐ సాంబశివరావు, కొండాపురం ఎస్సై షేక్ ఖాజావలీ దాడులు చేసి అతడిని పట్టుకున్నారు. నిందితుడిని విచారించగా కొమ్మి గ్రామంలో ఎస్.షమీల్ అహ్మద్ విక్రయిస్తున్నాడని తెలపడంతో అక్కడికి వెళ్లి అతన్ని కూడా పట్టుకుని గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితులు ఇచ్చిన సమాచారం మేరకు వాలేటివారిపాళెం మండలం అత్తింటివారిపాళెం గ్రామానికి చెందిన కారంశెట్టి సుధాకర్, లింగసముద్రం మండలం పెదపవని గ్రామానికి చెందిన షేక్ ఇంతియాజ్, షేక్ మహబూబ్ సాహెబ్, కావలి పట్టణం వైకుంఠపురానికి చెందిన కాకి డేనియేల్, లింగసముద్రం మండలం తాతా హోటల్ గ్రామంలోని గురునాథం గంగమ్మను అరెస్ట్ చేసి వారి నుంచి 18 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. వీరు సిలేరుకు చెందిన కత్తుల కిశోర్ అనే వ్యక్తి వద్ద గంజాయిని కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారని, అతడిని కూడా పట్టుకుంటామని డీఎస్పీ వెల్లడించారు.



మాట్లాడుతున్న డీఎస్పీ వెంకటరమణ



ఫలరాజుకు భలే గిరాకీ

జోరుగా మామిడి పండ్ల విక్రయాలు

వేసవి వచ్చిందంటే ఫలరాజుగా పిలిచే మామిడి పండ్లకు భలే గిరాకీ ఉంటుంది. మామిడిలో వందలాది రకాలు ఉన్నా ఫల ప్రియులు అత్యధికంగా ఇష్టపడే రకం బంగినపల్లి. ఈ సీజన్‌లో బంగినపల్లి మామిడి పండు తినని వారుండరు. ఈ సీజన్‌లో బంధువులు, స్నేహితుల ఇళ్లకు వెళ్లేటప్పుడు వెంట బంగినపల్లి మామిడి పండ్లు తీసుకెళ్లడం, వాటిని ఇష్టంగా తినడం సర్వసాధారణం.



చిన్నబజార్‌లో తోపుడుబండిపై మామిడి పండ్లు విక్రయిస్తున్న దృశ్యం

- ప్రజలు బాగా ఇష్టపడే రకం బంగినపల్లి
- ఎంతో ఇష్టంగా కొనుగోలు చేస్తున్న ఫల ప్రియులు

ఉమ్మడి నెల్లూరు జిల్లాలో..
మామిడి తోటల
విస్తీర్ణం - **11,200** హెక్టార్లు

నెల్లూరు(బారకాసు): ఉమ్మడి నెల్లూరు జిల్లాలో రాపూరు, గూడూరు, ఆత్మకూరు, సంగం, కావలి ప్రాంతాల్లో 11,200 హెక్టార్లలో మామిడి తోటలు ఉన్నాయి. ఏప్రిల్ నుంచి జూలై వరకు మామిడి విక్రయాలు జోరుగా సాగుతాయి. నూజివీడు, ఉలవపాడు ప్రాంతాల్లో పండిన మామిడి పండ్లకు బాగా డిమాండ్ ఉన్నప్పటికీ బంగినపల్లి మామిడికి మార్కెట్‌లో గిరాకీ ఎక్కువ. సైజును బట్టి కిలోకు రెండు నుంచి నాలుగు పండ్ల వరకు తూగుతాయి. అనేక పోషక విలువలున్న మామిడి పండ్లకు కార్బన్ కణాలను అరికట్టే గొప్ప గుణం ఉంది. ఈ పండులో ఉండే ఫాలిఫినోల్ ఇందుకు సహకరిస్తుంది. 15 శాతం చక్కెర, ఒక శాతం మాంసకృత్తులు, ఏ,బీ,సీ విటమిన్లు ఉంటాయి. పిండి పదార్థాలు 17 గ్రాములు, చక్కెర 14.8 గ్రాములు, పీచు పదార్థాలు 0.27 గ్రాములు, థయామిన్ 0.58 గ్రాములు, సియాసిన్ 0.584 గ్రాములు ఉంటాయి.

రోజుకు 50 టన్నుల వ్యాపారం

నెల్లూరు నగరంలోని చిన్నబజార్ హోల్‌సేల్ పండ్ల మార్కెట్ నుంచి ప్రస్తుతం నిత్యం 50 టన్నుల మామిడి పండ్ల విక్రయాలు జరుగుతున్నాయి. ఇక్కడి మార్కెట్‌కు సూళ్లూరుపేట, రాపూరు, ఆత్మకూరు తదితర ప్రాంతాల నుంచే కాకుండా ముఖ్యంగా కృష్ణా, ప్రకాశం, చిత్తూరు జిల్లాలతో పాటు ఖమ్మం జిల్లా నుంచి మామిడి పండ్లను దిగుమతి చేసుకుంటారు. జిల్లావ్యాప్తంగా రిటైల్‌గా అమ్ముకునే వ్యాపారులు ఇక్కడి పండ్ల మార్కెట్‌కు వచ్చి మామిడి పండ్లను హోల్‌సేల్ ధరకు కొనుగోలు చేసి తీసుకెళుతుంటారు. ప్రస్తుతం జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఎక్కడికక్కడ మామిడి పండ్ల హోల్‌సేల్ దుకాణాలు ఏర్పాటు కావడంతో అక్కడి సమీప ప్రాంతాలకు చెందిన వ్యాపారులు ఆయా దుకాణాలకు వెళ్లి కొనుగోలు చేసి రిటైల్ విక్రయాలు జరుపుకుంటున్నారు. దీంతో ప్రస్తుతం నెల్లూరు నగరంలోని చిన్నబజార్ పండ్ల మార్కెట్ నుంచి కేవలం నెల్లూరు నగరంలో రిటైల్‌గా అమ్ముకునే వారు మాత్రమే కొనుగోలు చేస్తున్నారు. రోజుకు 50 టన్నులు అంటే కేజీ రూ.30 చొప్పున రూ.15 లక్షల వ్యాపారం జరుగుతుందని పండ్ల వ్యాపారులు చెబుతున్నారు. ఈ నెల నుంచి దాదాపు 100 టన్నుల వరకు మామిడి పండ్ల వ్యాపారం జరిగే అవకాశాలు ఉన్నాయని పండ్ల వ్యాపారులు చెబుతున్నారు.

నెల్లూరు నగరంలో..

మినీబైపాస్, ట్రంక్‌రోడ్డు, స్టోన్‌హౌస్‌పేట, ఆత్మకూరు బస్టాండ్, నవాబుపేట, పొదలకూరు రోడ్డు, బాలాజీనగర్ తదితర ప్రాంతాల్లో చిరువ్యాపారులు తోపుడుబండ్లపై, గంపల్లో పెట్టుకుని మామిడి పండ్లను విక్రయిస్తున్నారు. అలాగే సూపర్‌మార్కెట్లతో పాటు పండ్ల దుకాణాల్లో కూడా బంగినపల్లి మామిడి పండ్ల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. కిలో రూ.50 నుంచి రూ.100 వరకు పండు నాణ్యత, సైజును బట్టి విక్రయిస్తున్నారు. నాలుగు నెలలపాటు కొనసాగే ఈ మామిడి పండ్ల వ్యాపారంపై అనేక మంది ఆధారపడి జీవనం సాగిస్తున్నారు.

ఆరోగ్యానికి మంచిది



వేసవి వచ్చే మామిడి పండ్లు తినడం ఆరోగ్యానికి మంచిది. చెట్టుపై పండిన పండ్లు తింటే మంచిది. మామిడి పండ్లు త్వరగా పండడానికి వ్యాపారులు కాల్షియంకార్బైడ్ రసాయనాన్ని వినియోగిస్తారు. అలా మాగించిన పండ్లు తింటే ఆరోగ్యానికి హానికరం.

– డాక్టర్ ఎస్.విజయభాస్కర్‌రెడ్డి, ప్రభుత్వ విశ్రాంత వైద్యనిపుణుడు, నెల్లూరు

బంగినపల్లికి గిరాకీ



ఈ ఏడాది మామిడి పండ్ల వ్యాపారం ఇప్పుడిప్పుడే ప్రారంభమైంది. గతంలో నూజివీడు, ఉలవపాడు మామిడి పండ్లకు మంచి డిమాండ్ ఉండేది. ప్రస్తుతం బంగినపల్లి మామిడి పండ్లకు మంచి గిరాకీ ఉంది. ఈ ఏడాది అకాల వర్షాల కారణంగా మామిడి కాయల్లో పురుగు చేరి దిగుమతి తగ్గింది. మా హోల్‌సేల్ దుకాణంలో సైజు, నాణ్యతను బట్టి టన్ను రూ.30 వేల నుంచి రూ.35 వేల వరకు విక్రయిస్తున్నాం.

– బాషాసాహెబ్, హోల్‌సేల్ పండ్ల వ్యాపారి, చిన్నబజార్, నెల్లూరు నగరం

100 టన్నుల వ్యాపారం



నెల్లూరులోని పండ్ల మార్కెట్‌కు కృష్ణా, ప్రకాశం, చిత్తూరు జిల్లాలతో పాటు నెల్లూరు జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి మామిడి పండ్లను దిగుమతి చేసుకుంటాం. బంగినపల్లి మామిడికి మంచి గిరాకీ ఉంది. గత నెలలో రోజుకు 50 టన్నుల పండ్లు విక్రయించాం. ఈ నెల నుంచి 100 టన్నుల వరకు వ్యాపారం జరగవచ్చు.

– జిలానిబాషా, ది నెల్లూరు టౌన్ ఫ్రూట్ మర్చంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు, చిన్నబజార్





చిన్నబజార్‌లోని హోల్‌సేల్ పండ్ల దుకాణంలో మామిడి పండ్లను గ్రేడింగ్ చేస్తున్న కార్మికులు

విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలి

- విద్యాశాఖ ప్రత్యేక కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న ప్రవీణ్ ప్రకాష్

కావలి: వేసవి సెలవుల అనంతరం జూన్ 12వ తేదీ నుంచి పాఠశాలలు పునః ప్రారంభమయ్యే నాటికి విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేలా ఉపాధ్యాయులు సిద్ధంగా ఉండాలని విద్యాశాఖ ప్రత్యేక కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ తెలిపారు. పట్టణంలోని విశ్వోదయ బాలికల ఉన్నత పాఠశాలలో 'జగనన్న విద్యాకానుక' స్టాక్‌పాయింట్‌ను శనివారం రాత్రి ఆయన తనిఖీ చేసి విద్యార్థులకు అందజేసే యూనిఫాం, ఇతర సామగ్రిని పరిశీలించారు. అనంతరం వైకుంఠపురం పెంకుల ఫ్యాక్టరీ గిరిజనకాలనీలో ఉన్న మున్సిపల్ ప్రైమరీ పాఠశాలలో జరుగుతున్న నాడు–నేడు పనులను పరిశీలించారు. ఆ పాఠశాలలో 5వ తరగతి చదువుతున్న అలేఖ్య అనే విద్యార్థిని ఇంటికి వెళ్లి ఆమె నోట్‌పుస్తకాలు, వర్క్‌బుక్స్ పరిశీలించారు. తదుపరి ఉపాధ్యాయులు, ఎంఈఓలతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యకు పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తోందని, పేద విద్యార్థులు ఉన్నత చదువులు చదవాలనేది ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. తాను ప్రతి శుక్ర, శని వారాల్లో రాష్ట్రంలో ఎక్కడైనా పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేస్తానని తెలిపారు.

గూడూరులో జాతీయస్థాయి నాటక పోటీలు

గూడూరు: పట్టణంలోని డీఎస్ఆర్ కమ్యూనిటీ హాల్ ఆవరణలో సంస్కృతి సమ్మేళనం సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం జాతీయస్థాయి నాటక పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా కరీంనగర్‌కు చెందిన చైతన్య కళాభారతి వారు ప్రదర్శించిన 'చీకటి పువ్వు', గుంటూరుకు చెందిన శ్రీఅమృత లహరి థియేటర్ ఆర్ట్స్ కళాకారులు ప్రదర్శించిన 'నాన్నా నేనొచ్చేస్తా' నాటకాలు ప్రేక్షకులను అలరించాయి. 'చీకటి పువ్వు' నాటికలో పరిస్థితులకు ఎవరూ అతీతులు కారనే వాస్తవానికి అద్దం పట్టేలా కళాకారులు తమ పాత్రలకు ప్రాణం పోశారు. 'నాన్నా..నేనొచ్చేస్తా'' నాటిక ప్రస్తుత సమాజ పోకడలను వివరిస్తూ సందేశాత్మకంగా సాగింది.

క్లుప్తంగా


కలిసికట్టుగా పనిచేయాలి



సీఎం సమక్షంలో చేతులు కలిపిన నెల్లూరు నగర ఎమ్మెల్యే, డిప్యూటీ మేయర్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): నెల్లూరు నగర ఎమ్మెల్యే పోలుబోయిన అనిల్‌కుమార్‌యాదవ్, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్‌యాదవ్ కలిసికట్టుగా పనిచేసి పార్టీకి మరింత బలం చేకూర్చాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సూచించినట్లు సమాచారం. ఇటీవల కావలి పర్యటన సందర్భంగా హెలిప్యాడ్ వద్ద సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వీరిద్దరి చేతులు కలిపి కరచాలనం చేయించారు. నెల్లూరు నగరంలో వైఎస్సార్‌సీపీ మరోసారి విజయం సాధించేలా ఇద్దరూ కలిసి పనిచేయాలని ఇరువురి చేతులు కలిపిన దృశ్యం జిల్లాలో ఆసక్తికరంగా మారింది.

రేషన్ బియ్యం పట్టివేత



స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యంతో విజిలెన్స్ అధికారులు

పెళ్లకూరు : మండలంలోని పునబాక తూర్పు కండ్రిగ గ్రామం వద్ద ఆదివారం అక్రమంగా తరలిస్తున్న 60 బస్తాల రేషన్ బియ్యాన్ని విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. రేషన్ బియ్యం దందాపై విజిలెన్స్ సీఐ శేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో కొంతకాలంగా నిఘా ఉంచారు. ఈ మేరకు దాడి చేసి రేషన్ బియ్యంతో పాటు ఓ వాహనాన్ని సీజ్ చేశారు. కేసు నమోదు చేసి పోలీసులకు అప్పగించినట్లు సీఐ తెలిపారు. ఈ దాడిలో సీఎస్ డీటీ ఓబయ్య పాల్గొన్నారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్ (లైవ్) :	137
లేయర్ (లైవ్) :	95
బ్రాయిలర్ చికెన్ :	236
బ్రాయిలర్ స్కిన్‌లెస్ :	262
లేయర్ చికెన్ :	162

పొదలకూరు నిమ్మధరలు (కిలో)



పెద్దవి:	రూ.55
సన్నవి:	రూ.25
పండ్లు:	రూ.18

వృద్ధురాలి అనుమానాస్పద మృతి

నెల్లూరు(క్రైమ్): వృద్ధురాలు అనుమానాస్పద స్థితిలో మృతిచెందిన ఘటన ఆదివారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల సమాచారం మేరకు.. పుచ్చలపల్లి రామచంద్రారెడ్డినగర్‌కు చెందిన కొండమ్మ(56) – మస్తానయ్య దంపతులు. వారికి హరిత కుమార్తె. ఆమెకు పదేళ్ల క్రితం పెంచలప్రసాద్‌తో వివాహం చేశారు. ఆమె గాంధీనగర్‌లో నివాసం ఉంటూ వలంటీర్‌గా పనిచేస్తోంది. కొండమ్మకు మూఢనమ్మకాలు ఎక్కువ. ఈ క్రమంలో ఆమెకు చెన్నైకు చెందిన ధరణి అనే మహిళతో పరిచయమైంది. తనకు అనేక మంది స్వామీజీలు తెలుసని, వారి ద్వారా జీవితంలో అనుకున్నది సాధించవచ్చని చెప్పి కొండమ్మను తన వెంట తిప్పుకోసాగింది. దీంతో కొండమ్మ స్వామీజీల కోసం విపరీతంగా డబ్బులు ఖర్చుపెట్టడంతోపాటు బంగారు ఆభరణాలను సైతం ఖర్చుచేసింది. ఈ విషయమై దంపతుల నడుమ విబేధాలు పొడచూపాయి. దీంతో మస్తానయ్య రెండేళ్లుగా భార్యకు దూరంగా కుమార్తె వద్ద ఉంటున్నాడు. గతేడాది జూలైలో కొండమ్మ ఇంటి నుంచి ఎటో వెళ్లిపోయింది. కుమార్తె ఫోన్ చేయగా త్వరలో వస్తానని చెప్పేది. డిసెంబర్ నుంచి ఫోన్ మాట్లాడడం మానేసింది. ఆమె ఇంటి పక్కనే ఉండే బాలగురవయ్యతో స్వాముల విషయమై అప్పుడప్పుడు కొండమ్మ మాట్లాడేది. ఈ నేపథ్యంలో ఈ నెల 13వ తేదీన కల్లూరుపల్లి హౌసింగ్‌బోర్డు కాలనీలోని నారాయణ కాలేజీ సమీపంలో కొండమ్మ మృతిచెంది ఉందని బాలగురవయ్య మృతురాలి కుమార్తెకు, భర్తకు తెలియజేశారు. దీంతో హరిత తన తల్లి మృతదేహాన్ని అతనినే ఇంటికి తీసుకురావాలని సూచించింది. ఆయన రాత్రి అంబులెన్స్‌లో కొండమ్మ మృతదేహాన్ని ఆమె ఇంటి వద్దకు తీసుకువచ్చి అక్కడి నుంచి వెళ్లిపోయారు. మృతురాలి ఒంటిపై ఎలాంటి గాయాలు లేవు. అయితే ఆమె ధరించిన నైటీపై అక్కడక్కడా రక్తపు మరకలు ఉండటాన్ని కుమార్తె గమనించింది. తన తల్లి మృతి అనుమానాస్పదంగా ఉందని, విచారించి తగిన చర్యలు తీసుకోవాలని హరిత వేదాయపాళెం పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మృతుడి వివరాలు లభ్యం

నెల్లూరు(క్రైమ్): సర్వేపల్లి కాలువలో శనివారం అనుమానాస్పద స్థితిలో మృతిచెందిన వ్యక్తి ప్రకాశం జిల్లా జరుగుమల్లి మండలానికి చెందిన బి.చినబాబుగా పోలీసులు ఆదివారం నిర్ధారించారు. పోలీసుల సమాచారం మేరకు.. చినబాబు(44) బేల్దారి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆయన భార్య అనారోగ్యంతో కొన్నేళ్ల క్రితం మృతిచెందారు. కుమారుడు ఇంజినీరింగ్ చదువుతున్నాడు. చినబాబు తన స్నేహితుడు అశోక్‌తో కలిసి గత కొంతకాలంగా బెంగళూరులో బేల్దారి పనులు చేసుకుంటూ అప్పుడప్పుడూ స్వగ్రామానికి వచ్చి వెళ్లేవాడు. ఈ నెల 13వ తేదీ రాత్రి తన అన్న చలపతి కుమార్తె వివాహానికి హాజరయ్యేందుకు చినబాబు, అశోక్ మూడు రోజుల క్రితం రైలులో నెల్లూరుకు బయలుదేరారు. మార్గమధ్యంలో వారు తిరుపతిలో రైలు దిగి పూటుగా మద్యం తాగారు. అశోక్ స్నేహితుడిని అక్కడే వదిలివేసి స్వగ్రామానికి వెళ్లిపోయాడు. ఈ నెల 13వ తేదీ సాయంత్రం చినబాబు నగరంలోని సర్వేపల్లి కాలువలో శవమై తేలాడు. చినబాబు స్వగ్రామానికి వెళ్లే క్రమంలో నెల్లూరు నగరంలో రైలు దిగి బహిర్భూమికని సర్వేపల్లి కాలువలో దిగి ప్రమాదవశాత్తు కాలువలో పడి మృతిచెందాడో..? మరే ఇతర కారణమో తెలియదు. బాలాజీనగర్ పోలీసులు విభిన్న కోణాల్లో కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వైభవంగా హనుమాన్ శోభాయాత్ర



సూళ్లూరుపేట: విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శోభాయాత్ర



రాపూరు: పెంచలకోనలో ఆంజనేయస్వామి ఊరేగింపు

సూళ్లూరుపేట: హనుమజ్జయంతి సందర్భంగా ఆదివారం విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో సూళ్లూరుపేట పట్టణంలో శోభాయాత్ర వేడుకగా నిర్వహించారు. బస్టాండ్ సెంటర్ నుంచి ప్రారంభించిన శోభాయాత్ర, బైక్ ర్యాలీని బీజేపీ నాయకులు ఆరణి విజయ భాస్కర్‌రెడ్డి, మురళీరెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం శోభాయాత్ర, ర్యాలీ బజారు వీధుల మీదుగా సూళ్లూరు, కోళ్లమిట్ట, కస్పారెడ్డిపాళెం, బాపూజీకాలనీ, రాఘవయ్యపేట ప్రాంతాలను కలుపుతూ కొనసాగింది. కార్యక్రమంలో విశ్వ హిందూ పరిషత్ ప్రతినిధులు మురళీరెడ్డి, మిట్ట కమ్మిరెడ్డి, సుంకర ప్రతిమ, గోపీ, దేవేందర్‌రెడ్డి, శ్రీధర్, శ్రీనివాసులు, ఉష, నారాయణరెడ్డి, రామకృష్ణ, సన్నీ, వసుంధర రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పెంచలకోనలో..

రాపూరు : హనుమజ్జయంతిని పురస్కరించుకుని పెంచలకోనలో వీరాంజేయస్వామికి ఆదివారం రాత్రి వైభవంగా క్షేత్రోత్సవం నిర్వహించారు. స్వామివారి మూలమూర్తికి ఉదయం అభిషేకం, పూలంగిసేవ, చందనాలంకారం, ఆకుపూజ, వడమాలలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి 7 గంటలకు శ్రీవారి కల్యాణ మండపంలో తిరుచ్చిపై ఆంజనేయస్వామి ఉత్సవమూర్తిని కొలువుదీర్చి విశేషంగా అలంకరించారు. మంగళ వాయిద్యాలతో వేదపండితులు మంత్రోచ్చారణల నడుమ క్షేత్రోత్సవం నిర్వహించారు. అలాగే రాపూరులోని శ్రీరామ మందిరంలో ప్రసన్నాంజేయునికి ప్రత్యేక పూజలు చేశారు. అర్చకుడు రామనాథేశ్వర శర్మ తీర్థప్రసాదాలను భక్తులకు పంపిణీ చేశారు. మద్దెలమడుగులో అయ్యప్ప ఆలయ ప్రాంగణంలోని 30 అడుగుల ఆంజేయస్వామి విగ్రహానికి విశేష పూజలు చేశారు. భక్తులకు అన్నదానం చేశారు.